క్లుప్తంగా

వైభవంగా శ్రీకృష్ణుని ఊరేగింపు



శ్రీకృష్ణుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి శ్రీకాళహస్తి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణుని ఊరేగింపు వైభవంగా జరిగింది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేశారు. ప్రతిమకు మూడు రోజుల పాటు వివిధ అభిషేకాలతో విశేషాలంకరణ చేసి, నిత్య పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించారు. బుధవారం స్వామివారి ప్రతిమకు పూజలు చేసి, భజనలు, కోలాటాలు, డప్పులు, భాజా భజంత్రీలతో పురవీధుల్లో ఊరేగించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, గ్రామస్తులు పూజలు చేసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం యాదవ్, సభ్యులు వెంకటలక్ష్మి, రాజేష్, పెంచలయ్య, సుధ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



ఆలయ ధ్వజస్తంభం వద్ద ఐఏఎస్ అధికారి బుదిటి రాజశేఖర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని బుధవారం ఐఏఎస్ అధికారి బుదిటి రాజశేఖర్ దంపతులు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ ఎస్వీఎస్ఎన్ మూర్తి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశా రు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వా మి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉరుసు ఉత్సవాలకు రండి

- సుమన్‌కు ఆహ్వానం



సుమన్‌ను సన్మానిస్తున్న దర్గా నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న హజరత్ జుంలేషా పీర్ దర్గాలో త్వరలో జరగనున్న ఉరుసు ఉత్సవాలకు హాజరు కావాలని ప్రముఖ సినీనటుడు సుమన్‌ను దర్గా నిర్వాహకులు ఆహ్వానించారు. రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం ఆయన్ని కలిసి ఘనంగా సన్మానించి, ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమన్‌ను తాము ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానించామని, తప్పకుండా హాజరవుతామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఉరుసు నిర్వాహకులు ఓరుగంటి నాగేశ్వరరావు, గుమ్మళ్ల రాజేశ్వరరావు, జమ్రుద్ బాదుషా, జుంలేషా, రహీంఖాన్, మహ్మద్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌రమేష్‌బాబును సన్మానిస్తున్న ఉద్యోగులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్‌గా విధులు నిర్వహించి పొన్నూరుకు బదిలీ అయిన రమేష్‌బాబును ఉద్యోగులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయచంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్ట్ వరత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తిరుమెర్ల జయచంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. ఆయన బుధవారం వరత్తూరులో జయచంద్రారెడ్డి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కాటూరులో ఎంపీటీసీ సభ్యుడు నెల్లటూరు రవి మాతృమూర్తి నెల్లటూరు చెన్నమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కర్మక్రియల కార్యక్రమంలో పాల్గొని, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు గురవయ్య, మణి నాయుడు, రవిరెడ్డి, కిరణ్, శివా యాదవ్ తదితరులు ఉన్నారు.

చట్టాలు పటిష్టం చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యుల భద్రతకు చట్టాలు మరింత పటిష్టం చేయాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడి చేయడం, అమర్యాదగా మాట్లాడడం నేరంగా పరిగణించి నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యులంటే ప్రాణాలను కాపాడే వారన్న గౌరవభావన కలిగేలా సమాజంలోనూ మార్పు రావాలి. కోల్‌కతా ఘటన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలి.

- డాక్టర్ నాగరాజు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, పాపానాయుడుపేట, ఏర్పేడు మండలం



మరింత రక్షణ అవసరం



వైద్యుని మానసిక పరిస్థితి ప్రశాంతంగా ఉంటేనే మంచి వైద్యసేవలు అందించగలుగుతారు. భయాందోళనల నడుమ విధులు నిర్వహించాల్సి వస్తే వైద్యం కూడా అలానే ఉంటుంది. వైద్యులపై దాడులు చేసే వారిని, భయపెట్టేలా మాట్లాడేవారిపై కఠినంగా వ్యవహరించాలి. ప్రధానంగా రాత్రి వేళల్లో విధుల్లో ఉండే వైద్యులకు మరింత రక్షణ అవసరం. వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నాం.

-డాక్టర్ కటారి కుమార్, ప్రధాన వైద్యాధికారి, పీహెచ్‌సీ, కేవీబీపురం(వరదయ్యపాళెం)

తెలుగు.. కావాలి జగతికి వెలుగు

■ భాషా వికాసానికి విశేష కృషి అవసరం ■ పటిష్ట అమలుతో రాజసం ■ నేడు తెలుగుభాషాదినోత్సవం





కల్లివెట్టు హైస్కూల్‌లో గిడుగు అక్షర ఆకృతిలో ఉన్న విద్యార్థులు

నిండైన అక్షరంలో అనురాగ పరిమళం..పొందికైన పదంలో ఉట్టిపడే రాజసం.. చక్కనైన వాక్యంలో అద్భుత లయ విన్యాసం..కావ్యాల్లో నవరస సమ్మేళనం.. రాగ రంజితమైన ధ్వని తరంగాల సొంతం.. మనస్సుకు ప్రతి రూపమై మమతకు తొలిరూపమై అన్ని భావాలకు ఆకృతి నిచ్చి అంతరాత్మకు ఆవిష్కరణై, నిండు గుండెల శ్వాస. అంతేకాదు ఎంత వర్ణించినా తరగని తెలుగు భాషకు అంత గొప్పదనం ఉంది. అయితే ఆధునిక యుగంలో తెలుగు పరిరక్షణలో వెనుకబాటుతనం కనిపిస్తోంది. ఆంగ్ల మోజులో పడి అమ్మభాషను నిర్లక్ష్యం చేసే వారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. అది తరగిపోవాలి.. తెలుగు కావాలి జగతి వెలుగు. నేడు తెలుగుభాషాదినోత్సవం సందర్భంగా కథనం.

వరదయ్యపాళెం: అమ్మ భాష అమృతం లాంటిది. మన బాధలైన, సంతోషాలైన మాతృభాష తెలుగు వ్యక్తపరిచినంతగా ఇక ఏ భాషలోనూ వ్యక్తం చేయలేమనడం అతిశయోక్తి కాదు. మాతృభాషను మనం మరిచిపోతే అమ్మను మరిచిపోయినట్లే. పాశ్చాత్య భాషల మోజులోపడి మనం మాతృభాషను మరచిపోతున్నాం. అమ్మ భాషను కాపాడుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ప్రభుత్వాలు ఇందుకు పాటుపడాల్సిన అవసరం ఉంది. కాగా కలివెట్టు హైస్కూలులో గిడుగు ఆకృతిలో విద్యార్థులు భాషకు పట్టం కట్టారు. నేడు మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుభాషపై కొందరి అభిప్రాయాలు వారి మాటల్లోనే....

తెలుగు పరిరక్షణకు కృషి అవసరం



తెలుగు భాష పరిరక్షణకు కృషి అవసరం. లేకుంటే 20 సంవత్సరాల్లో తెలుగు మాధుర్యం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తెలుగు భాష మాధుర్యాన్ని, తీయదనాన్ని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

-సుమతి, తెలుగు పండిట్, గోవర్ధనపురం హైస్కూల్

మాతృభాషతోనే మనుగడ



అమ్మ ఉగ్గు పాలతో నేర్చుకున్న అమ్మ భాషను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత తెలుగువారైన మనందరిపైనా ఉంది. తెలుగు సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకుంటూ భవితరాలకు భాషను అందించాలి. ఒక జాతి మనుగడ ఆ జాతి మాట్లాడే మాతృభాషపైనా ఆధారపడి ఉంటుంది. భాష నశిస్తే ఆ భాష మాట్లాడే జాతి అంతరించినట్లే. అమ్మ భాషకు అగ్రతాంబులం ఇచ్చి.. మన సంస్కృతిని ప్రపంచానికి చాటి చెబుద్దాం. మాతృ భాష, మాతృ భూమిని మరిస్తే మాతృమూర్తిని మరచినట్లే.

-పల్లిపట్టు నాగరాజు, తెలుగు ఉపాధ్యాయుడు, వరదయ్యపాళెం హైస్కూల్

మాతృభాషతోనే మనకు రక్షణ



తెలుగు పరిస్థితి ప్రస్తుతం దీనావస్థలో ఉంది. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు మాతృ భాష బోధన జరగడం లేదు. ఎల్‌కేజీ నుంచి ఇంగ్లిషుపైనే మక్కువ పెంచుకుంటున్నారు. తల్లిదండ్రులు పరభాషపై మక్కువ పెంచుకోవడం దురదృష్టకరం. ప్రభుత్వపరంగా ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పోటీ ప్రపంచంలో ఇంగ్లిషుతోపాటు తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్ని ఉత్సవాలు నిర్వహించినా ప్రయోజనం ఉండదు. తెలుగు, సంస్కృతం భాషలు మనిషికి రెండు కళ్ల వంటివి. వాటిని పరిరక్షించుకోవాలి. మన మాతృభాషతోనే మనకు రక్షణ ఉంటుంది.

-మునెయ్య, తెలుగు పండిత్, గోవర్ధనపురం హైస్కూల్

అమ్మభాషకు అంకితమవుదాం



వేల సంవత్సరాల చరిత్ర గల భాష మన తెలుగు భాష. ప్రాచీన తెలుగు విశిష్టత కలిగిన తెలుగు మన వారసత్వ సంపద. ఈ భాషా సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత తెలుగువారైన మనందరిపై ఉంది. నేడు ప్రపంచీకరణ నేపథ్యంలో మమ్మీడాడి సంస్కృతి పెరిగిపోయింది. పర భాషలను గౌరవిస్తూ మన భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిఒడి నుంచి నేర్చుకునే మాతృభాష మన తెలుగు. అటువంటి అమ్మభాషకు అంకితమవ్వాలి.

-యువశ్రీ మురళి, అధ్యక్షుడు, అభ్యుదయ రచయితల సంఘం, తిరుపతి జిల్లా

సత్యవేడు ఎస్‌ఐగా రామస్వామి



సత్యవేడు: స్థానిక ఎస్‌ఐగా ఓ.రామస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి అలిపిరి స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై సత్యవేడుకు వచ్చారు. సత్యవేడులో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తొలుత చర్యలు తీసుకుంటామన్నారు.

6 నుంచి విద్యార్థులకు పోటీలు

శ్రీకాళహస్తి: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6 నుంచి ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి ఎస్వీఆర్ ప్రసాద్ తెలిపారు. రోటరీక్లబ్ ఆవరణలో 6వ తేదీన రంగోలి, 13, డ్యాన్స్ పోటీలు, 20న చిత్రలేఖనం, 27న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలో చదివే బాలబాలికలు ఈ పోటీలకు హాజరు కావాలని వారు ఓ సంయుక్త ప్రకటనలో కోరారు.

సంతకు రెండు ఎకరాలు కేటాయించాలి

సత్యవేడు: సంత స్థలంలో టీటీడీ కల్యాణ మండపం ఏర్పాటు చేస్తుండడంతో సంత నిర్వహణకు 2 ఎకరాల స్థలం కేటాయించాలని సర్పంచ్ పి.మంజుల కోరారు. బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యంను ఆమె కోరారు. తెలుగు గంగ కాలువ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో సంత ఏర్పాటు అనుమతులు ఇవ్వాలని మండల అధికారులకు విజ్ఞప్తి చేశారు. త్వరితగతిన స్థలం సర్వే చేసి, సత్యవేడులో సంతను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సహకరించాలని సర్పంచ్ కోరారు.

మా భూములను కాపాడండి మహాప్రభో



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న శివనాథపాళెం వాసులు

శ్రీకాళహస్తి: తమ భూములను కాపాడండి మహాప్రభో అంటూ శివనాథపాళెం దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తొట్టంబేడు తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. స్థానికేతరులు తమ గ్రామంలోని భూములపై కన్నేశారని, వారు రాత్రికి రాత్రే తమ పొలాలను దున్నేస్తూ చదును చేసి గణాలు వేయిస్తున్నారన్నారు. ఉదయం విడిగా ఉన్న భూమి రాత్రికి రాత్రి చదును చేసి పంటపొలాల్లో మార్చేస్తున్నారన్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ముస్లింలు ఇద్దరు తమ పొలాలపై కన్నేసి ఆక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగితే పట్టణానికి వస్తే మీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. తమకు ఈ గ్రామంలో పుట్టి పెరిగినా సెంటు స్థలం లేదని శ్రీకాళహస్తి పట్టణం నుంచి వచ్చిన వారికి 20 నుంచి 30 ఎకరాలు ఒక్కొక్కరికి ఉందన్నారు. శివనాథపాళెం బ్లాక్ నంబర్ 9లో ఉన్న సుమారు వంద ఎకరాల్లో 80 ఎకరాలను స్థానికేతరులు కబ్జా చేసి తైలం, మామిడిచెట్లను పెట్టేశారన్నారు. మిగిలిన 20 ఎకరాలను శ్రీకాళహస్తికి చెందిన రఫీ, మునీర్ ఆక్రమించి చదును చేసేశారని గ్రామస్తులు చెబుతున్నారు. తాము ప్రశ్నించడానికి పొలాల వద్దకు వెళితే మారణాయుధాలతో తిరుగుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

సత్యవేడుకు టీటీడీ కల్యాణ మండపం ఓ వరం

సత్యవేడు: టీటీడీ కల్యాణమండం సత్యవేడు ప్రజలకు శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు ఇచ్చిన వరం లాంటిదేనని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం ఎమ్మెల్యే, టీటీడీ ఈఈ కే.మల్లికార్జునప్రసాద్, డిప్యూటీ ఈఈ ఎస్ భాస్కర్, స్థానిక సర్పంచ్ పి.మంజులతో కలసి టీటీడీ కల్యాణ మండపానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 2 కోట్ల టీటీడీ నిధులతో కల్యాణ మండపం నిర్మాణం పనులు జరుగుతాయన్నారు. కల్యాణ మండపం రెండు అంతస్తుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కృష్ణమోహన్‌ను కోరారు. మండలంలోని దాసుకుప్పం బైపాస్ రోడ్డుకు రూ.27 కోట్లు మంజూరైందన్నారు. పార్టీలకతీతంగా దాసుకుప్పం గ్రామస్తులు రోడ్డు ఏర్పాటుకు భూములు ఇవ్వాలని కోరారు. వానెల్లూరులో 18 ఎకరాలు ఎంబీజీ లేఅవుట్ గుర్తించారని, అందులో 600 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టీవీ సుబ్రమమణ్యం, ఎంపీడీఓ చంద్రశేఖర్, సీఐ మురళి, ఎస్‌ఐ రామస్వామి, ఎంఈఓ కే. రవి, ఏఈ గురుప్రసాద్, రమేష్, కే. సుందరరామిరెడ్డి, వి. మస్తాన్, వికేఎస్ బాషా, ప్రవీణ్‌కుమార్, టి. కన్నయ్య నాయుడు, రామాంజుల నాయుడు పాల్గొన్నార

ఆర్థిక అక్షరాస్యతతో ఆదాయం వృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న తేజస్వి

ఏర్పేడు: మహిళలు ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చని ఏర్పేడు డీసీసీ బ్యాంకు మేనేజర్ తేజస్వి అన్నారు. బుధవారం మండలంలోని నాగంపల్లె సమీపంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బడ్జెట్, పొదుపు స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై అవగాహనన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు ఫీల్డ్ అధికారి రమేష్, ఎస్ఓఎస్ కుటుంబ బలోపేత లొకేషన్ ఇన్‌చార్జి సత్యనారాయణ, మునిరత్నం, మహిళలు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ పనులు కల్పించాలి



అంజిమేడులో పనులు పరిశీలిస్తున్న ఏపీడీ సరిత

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలోని జాబ్‌కార్డుదారులందరికీ పనులు కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. బుధవారం మండలంలోని ఇసుకతాగేలి, అంజిమేడులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి హామీలో చెరువుల్లో ఫిష్ పాండ్(చేపల గుంతలు) తవ్వకాలు చేపట్టాలన్నారు. చేపల గుంతలకు వేలం నిర్వహించి, చేపల పెంపకం చేపట్టడం ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూరుతుందన్నారు. రైతుల పొలాల్లో నీటిగుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీటి గుంతలతో భూగర్భ జలాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఉపాధిహామీ పనుల్లో రోజుకు రూ.300 వేతనం వచ్చేలా కూలీలకు కొలతలు ఇవ్వాలన్నారు. గ్రామాల అభివృద్ధికి తోడ్పడే పనులను గుర్తించి గ్రామ సభ తీర్మానాలను పొంది, ఉన్నతాధికారుల నుంచి పనులకు అనుమతులు తీసుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో దేవరి, సాంకేతిక సహాయకులు మనోహర్, రవీంద్రుడు, క్షేత్ర సహాయకురాలు గీతాంజలి పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ఘనంగా గోకులాష్టమి



గ్రామోత్సవంలో కల్యాణ వెంకన్న, శ్రీకృష్ణస్వామి



ఉట్టి కొడుతున్న యువకులు

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గోకులాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం యువకులు ఉట్లోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం సుప్రభాతసేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. 9 గంటలకు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన శ్రీకృష్ణుడు మాడవీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న గోపాలునికి, శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక స్నపన తిరుమంజనం చేసి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలు పూర్తి చేసిన అర్చకులు శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకన్నను, శ్రీకృష్ణ స్వామిని వేర్వేరుగా తిరుచ్చి వాహనాలపై అధిష్టింప చేశారు. మేళ తాళాలు, గోవింద నామ స్మరణల మధ్య ఉత్సవమూర్తులు మాడవీధుల్లో ఊరేగుతూ సన్నిధివీధిలో పదహారు కాళ్ల మండలంలో కొలువుదీరారు. గోకులాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్లోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్‌లు పర్యవేక్షించారు.

కరాటేలో శ్రీకాళహస్తి విద్యార్థి ప్రతిభ



ప్రియదర్శినిని అభినందిస్తున్న ప్రముఖులు

శ్రీకాళహస్తి: పాన్నేరిలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన చిన్నారి ప్రియదర్శిని ఆరేళ్ల విభాగంలో ప్రతిభ కనబరిచి, రెండో బహుమతి సాధించింది. ఈ నేపథ్యంలో బుధవారం పలువురు ప్రియదర్శినిని అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువ కలిగేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. ఒక లక్ష్యంతో సాగితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రియదర్శిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సినీనటుడు సుమన్ జన్మదిన వేడుకలు



రేణిగుంట: సుమన్‌ను సత్కరిస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడు

రేణిగుంట: సినీనటుడు సుమన్ జన్మదిన వేడుకలు బుధవారం రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజ కర్మాగారం ప్రాంగణంలోని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి నివాసంలో ఘనంగా జరిగాయి. అమరరాజ సంస్థ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆయనకు వారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

శ్రీకాళహస్తి: పట్టణంలో బాలాజీ తిరుపతి జిల్లా గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ సినీనటుడు సుమన్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ సుమన్ ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉదయగిరి మోహన్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, తిరుకాల పురుషోత్తంగౌడ్, కోసూరు వెంకటరమణ గౌ డ్, అట్ల కృష్ణయ్య గౌడ్, మునిశేఖర్ గౌడ్, సూర్యప్రకాష్ గౌడ్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, దిలీప్‌గౌడ్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జీఎన్‌కండ్రిగ గ్రామంలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పశుగణాభివృద్ధి సంఘం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సంయుక్తంగా పశువులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 పశువులను పరిశీలించి గర్భకోశ వ్యాధులున్న 12 పశువులకు చికిత్స చేశారు. మరో 16 పశువులకు సాధారణ వ్యాధులకు సంబంధించి చికిత్స చేశారు. అలాగే రూ.20 వేలు విలువైన మందులు, ధాణా ప్యాకెట్లను రైతులకు వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి జిల్లా పశుగణాభివృద్ధి సంఘం పశు వైద్యాధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడను ఎలా పెంచితే పాడి వృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మునేశ్వరి, పశు వైద్యాధికారులు మునిరాజ, వీరభద్రారెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, గౌరి, నరేష్‌లు పాల్గొన్నారు.

లక్కీడిప్‌లో శ్రీవారి అంగప్రదక్షిణ టోకెన్ల కేటాయింపు

తిరుమల: ప్రతి శనివారం తిరుపతి అర్బన్, తిరుమల స్థానికులకు కేటాయిస్తున్న 250 శ్రీవారి ఆలయ అంగప్రదక్షిణ టికెట్లు, ఇకపై లక్కీడిప్ నిర్వహించి కేటాయించనున్నట్లు బుధవారం టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టికెట్లు కావాల్సిన భక్తులు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు లక్కీడిప్ నిర్వహిస్తారు. టికెట్లు పొందిన భక్తు లకు వారి మొబైల్ ఫోన్లకు ఎస్‌ఎంఎస్ రూపంలో సమాచారం ఇస్తారు. ఆన్‌లైన్‌లో ఉంచుతారు. ఇలా టికెట్లు పొందిన భక్తులు ఆన్‌లైన్‌లో రూ.500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అలాగే వీరు మహతి కళాక్షేత్రంలో తమ ఆధార్ కార్డు చూపి శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు అంగప్రదక్షిణ టికెట్లు పొందవచ్చు.లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులను శనివారం తెల్లవారుజామున అంగప్రదక్షిణకు అనుమతిస్తారు.

తొట్టంబేడు ఎస్‌ఐగా ఈశ్వరయ్య



శ్రీకాళహస్తి: తొట్టంబేడు ఎస్‌ఐగా కె.ఈశ్వరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఎర్రావారిపాళెం నుంచి ఇక్కడికి వ చ్చారు. శాంతిభద్రత పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

శ్రీకపిలేశ్వరాలయంలో లక్ష కుంకుమార్చన రేపు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30న శుక్రవారం శ్రీకామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 12 గంటల వరకు గణపతి పూజ, లక్ష కుంకుమార్చన, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి , అమ్మవార్ల తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.